

పెద్ద ధన్వాడలో పండుగ వాతావరణం

- జైలు నుంచి రైతులు విడుదల కావడంతో గ్రామంలో ఏరువాక వేడుకలు 7


తుంగభద్ర నదిలో ఎద్దులకు స్నానం చేయిస్తున్న రైతులు

లోకల్ ఫైట్‌లో.. నువ్వా..నేనా

- నెలాఖరులో నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం
- పల్లెల్లో వేడెక్కిన రాజకీయం
- రంగంలో దిగిన ఆశావహులు.. ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు షురూ
- కార్పొరేషన్, మునిసిపాలిటీలలో వార్డుల విభజనతో మొదలైన సందడి
- స్వరం మార్చిన పొలిటికల్ పార్టీలు
- ఎన్నికలకు సిద్ధం కావాలని శ్రేణులకు సంకేతాలు
- అధికార పార్టీకి తలనొప్పిగా వర్గపోరు


మూసాపేట మండలంలోని పోల్కంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం


స్థానిక పోరుకు సమయం దగ్గర పడుతోంది. పోటీ చేసేందుకు ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. ఈ నెలాఖరుకల్లా నోటిఫికేషన్ వస్తుందన్న సంకేతాలు వెలువడుతుండటంతో కొంతకాలం నుంచి స్తబ్దుగా ఉన్న పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. ఈ పాటికే ఆయా పార్టీల నాయకులు ఎన్నికలకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిస్తున్నారు. రైతు భరోసా ప్రక్రియ ముగిసిన వెంటనే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందని అధికార పార్టీ ముఖ్య నేతలు శ్రేణులను సమాయత్త పరుస్తున్నట్లు తెలుస్తున్నది.

మహబూబ్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల సందడి మొదలైంది.. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న పల్లె రాజకీయం ఒక్కసారిగా వేడెక్కుతోంది.. ఈ నెలాఖరులో షెడ్యూల్ వెలువడనుందన్న ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు ప్రభుత్వం వానాకాలం రైతు భరోసా పేరిట నిధులు విడుదల చేయడం.. వారం రోజుల్లో ప్రక్రియ ముగిస్తామని ప్రకటించడం చూస్తుంటే రైతు భరోసా ప్రక్రియ ముగిసిన వెంటనే ఎన్నికలకు వెళ్లనున్నామన్న సంకేతాన్ని ప్రభుత్వం పరోక్షంగా ఇస్తోంది. అధికార పార్టీ ముఖ్య నాయకులు పార్టీ శ్రేణులను స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని స్పష్టం చేస్తున్నాయి. దీంతో జూలైలో ఎన్నికలు వస్తాయన్న విషయం స్పష్టమవుతోంది. దీంతో గ్రామాల్లో పోటీ చేసే ఆశావహుల మధ్య నువ్వా.. నేనా అన్నట్లుగా ఇప్పటికే ప్రచారం చేస్తూ ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చే సుకుంటున్నారు.

● పంచాయతీనా? ప్రాదేశికమా?

ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారా? లేదంటే ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారా? అన్న విషయంలో కొంత గందరగోళం నెలకొంది. వాస్తవానికి సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఏడాదిన్నర కాలం కావస్తుండగా, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల గడువు ముగిసి ఏడాదైంది. ముందుగా లెక్క ప్రకారం సర్పంచ్ ఎన్నికలే నిర్వహించాల్సి ఉన్నా సర్పంచ్ ఎన్నికలకు వెళితే పోటీ తీవ్రంగా ఉంటుంది. అధికార పార్టీనుంచి ఆశావహులు పెద్దసంఖ్యలో ఉండటంతో వారిలో ఒకరికి టికెట్ ఇస్తే మిగతావారు వర్గాలుగా విడిపోవడం వల్ల పార్టీలో వర్గపోరు తయారవుతుందని, ఆ ప్రభావం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై పడుతుందని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తు కావడంతో ముందుగా వాటిని ఎన్నికలు నిర్వహించి ఆ తరువాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం వల్ల రెండు రకాల ప్రయోజనాలుంటాయని అందుకే ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలనే నిర్వహించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

జిల్లా	సర్పంచ్	ఎంపీటీసీ	జడ్పీటీసీ
మహబూబ్‌నగర్	439	175	14
నారాయణపేట	280	135	13
వనపర్తి	255	128	15
గద్వాల	255	141	12
నాగర్‌కర్నూల్	461	210	20
మొత్తం	1690	789	74



● ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు గెలుపొందగా, ఇద్దరు బీఆర్ఎస్ నుంచి గెలిచినా అందులో ఒకరు అధికార పార్టీలో చేరారు. దీంతో స్థానిక

- మిగతా 6లో..

సందిగ్ధంలో సీఎం హామీ

- రిజర్వ్ ఫారెస్టులో శాశ్వత నిర్మాణాలకు అటవీశాఖ అభ్యంతరాలు
- తాత్కాలిక నిర్మాణాలకు ఓకే అంటున్న అధికారులు

నాగర్‌కర్నూల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని చెంచులకు శాశ్వత గృహ నిర్మాణం కలగానే మిగలనుంది. అనేక ఒడిదుడుకులతో జీవన సమరాన్ని కొనసాగిస్తున్న ఆదివాసీలు తలదాచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన గృహనిర్మాణానికి అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలపడం విమర్శలకు తావిస్తోంది. నల్లమలలో చెంచులు అటవీశాఖ మధ్యన చాలాకాలంగా ఘర్షణ వాతావరణం నెలకొంటున్న విషయం తెలిసిందే. అనాదిగా అడవిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు అటవీశాఖ అనేక నిబంధనలు విధిస్తోందని ఆరోపిస్తూ చెంచులు మూడుసార్లు నల్లమల నుంచి జిల్లా కేంద్రాలకు పాదయాత్ర కూడా చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 88చెంచు పెంటల్లో 2,595 కుటుంబాలు నివసిస్తున్నాయి. 8,784మంది చెంచులు ఇక్కడ జీవనం కొనసాగిస్తున్నారు.


నల్లమలలోని రాంపూర్ పెంటలో చెంచులు నివసిస్తున్న గుడిసె(ఫైల్)

అటవీశాఖ అభ్యంతరాలు..

గత నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్రాబాద్ మండలం మాచారాన్ని సందర్శించిన సమయంలో చెంచుల సమస్యలను ప్రధానంగా ప్రస్తావించారు. మన్ననూర్ ఐటీడీఏ పరిధిలో ఉన్న నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 26 మండలాల్లో 150 చెంచు పెంటల్లో నివసిస్తున్న 4,259 కుటుంబాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్న చెంచులు, గోండుల కోసం 10 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. అయితే ఇళ్ల నిర్మాణానికి అటవీశాఖ అనేక అభ్యంతరాలను వ్యక్తం చేస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో కుడిచింతలబయలు, సార్లపల్లి, తాటిగుండాల, వటవర్లపల్లి పుల్లంపెంట నుంచి చెంచులు చెంచుయేతరులను మైదాన ప్రాంతాలకు తరలించే క్రమంలో పెద్దకొత్తపల్లి మండలం బాచారం దగ్గర స్థలాలను ఎంపిక చేశారు. పునరావాసం పొందేందుకు గ్రేడ్-ఏ కింద రూ.15లక్షల నగదు గ్రేడ్-బీ కింద 5ఎకరాల భూమి, డబుల్‌బెడ్రూం ఇల్లు ఇచ్చే విధంగా అటవీశాఖ ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో జరిగిన గ్రామ సభలపై చెంచుల నుంచి అనేక అభ్యంతరాలున్నాయి. బోగస్ తీర్మానాలతో అటవీశాఖ తమను నల్లమల నుంచి తరలించే కుట్రను అమలు చేస్తుందని ఆదివాసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

శాశ్వత నిర్మాణాలకు నో..

నల్లమలలోని కోర్, బఫర్ జోన్లలో శాశ్వత నిర్మాణాలకు అనుమతించేది లేదని అటవీశాఖ తేల్చి చెబుతోంది. కంటైనర్ తరహాలో రేకుల షెడ్లను తప్ప ఇసుక, సిమెంట్, పిల్లర్ల నిర్మాణాన్ని చేపట్టవద్దంటూ కఠినమైన ఆదేశాలను అటవీశాఖ అమలు చేస్తోంది. అటవీశాఖ మల్లాపూర్, రాంపూర్, పుల్లాయ పల్లి, బౌరాపూర్, ఈర్లపెంట, సంగిడి గుండాల, కొమ్మనపెంట, కొల్లంపెంట, మేడిమలకల ప్రాంతాలల్లో దాదాపు 180 ప్రీ ఫ్యాబ్రికేటెడ్ షెడ్ల నిర్మాణాన్ని చేపట్టింది. చెంచులకు శాశ్వత గృహ నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ నెలాఖరులోగా స్పష్టమైన విధి విధానాలు వచ్చే అవకాశాలున్నట్లు వివిధ వర్గాల నుంచి తెలుస్తోంది. చెంచు పెంటల్లో సిమెంట్, ఇటుకలతో తయారు చేసే శాశ్వత గృహ నిర్మాణాన్ని మాత్రమే తాము అంగీకరిస్తామని చెంచు సేవా సమితి నేతలు గురవయ్య, మల్లికార్జున్‌లు పేర్కొంటుండడం గమనార్హం.



ఆదాయం పెరిగేదెలా?

- లైసెన్స్ లేకుండానే మునిసిపాలిటీల్లో వ్యాపారాలు
- పునరుద్ధరణకు నోచుకోని వైనం
- అమలు కానీ నూతన విధానం
- పట్టించుకోని పాలకవర్గం, అధికార యంత్రాంగం

6


మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని అప్పన్నపల్లి తిరుమల హిల్స్ వద్ద ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి (ఫైల్)

నవోదయ పాఠశాల ప్రారంభమయ్యేనా?

- తాత్కాలిక భవనం కోసం ఏర్పాట్లు
- ఇంకా పూర్తి కాని స్థల సేకరణ
- ప్రారంభం కాని తరగతులు

అక్రమ నిర్మాణాలు నేలమట్టం

- ఉదయం నుంచే కూల్చివేతలు
- పోలీస్ బందోబస్తు నడుమ 33 ఇళ్లను కూల్చివేసిన అధికారులు
- ఖాళీ చేసేందుకు సమయం ఇవ్వాలని వేడుకున్న బాధితులు


అక్రమ ఇళ్లను కూల్చుతున్న ఎక్స్‌కవేటర్
ఇళ్లను నేలమట్టం చేస్తుండడంతో శాపనార్థాలు పెడుతున్న మహిళలు

చారకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) అక్రమ నిర్మాణాలను అధికారులు ఎక్స్‌కవేటర్ సహాయంతో నేలమట్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిరసనగండ్ల పంచాయతీలోని అయోధ్య నగర్‌లో సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయ భూముల్లో సర్వే నంబరు 327లో 7.6 గుంటలు, 328లో 9.15 గుంటల్లో నిర్మించిన 33 అక్రమ ఇళ్లను గురువారం ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేశారు. అనుమతులు లేకుండా 16 ఇళ్లు, 11 చిరువ్యాపార దుకాణాలు, ఏడుగురు స్థలాలను ఆక్రమించుకొన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆలయ ఫౌండరీ ట్రస్ట్ డేరం రామశర్మ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2024 జనవరి 23న ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని దేవాదాయ, ధర్మాదాయ, రెవెన్యూ, పోలీస్ శాఖలకు స్పష్టమైన ఆదేశాలను జారీచేశారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం అక్రమంగా ఇంటి నిర్మాణం చేసుకున్న యజమానులకు నోటీసులు జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం రెవెన్యూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఇళ్లను నేలమట్టం చేశారు. సెకండ్ లిస్టులో ఉన్న 16 మంది ఇళ్లను హైకోర్టు ఉత్తర్వులు రాగానే కూల్చి వేస్తామని మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. పలు వురు బాధితులు పాఠశాల పాత భవనంలో.. మరి కొందరు ఎటు వెళ్లాలో తెలియక అక్కడే ఉండి పోయారు. ఇంట్లో సామానులు తీసుకోవడానికి కూడా సమయం ఇవ్వకపోవడంతో బాధితులు అధికారులు, ఆలయ అర్చకుల తీరుపై దుమ్మెత్తి పోశారు. ఇళ్ల కూల్చి వేతను కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి సునిత, దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణధరి, ఆలయ ఈవో అంజనేయులు, సీఐలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేసి వారికి నాణ్యతగా కట్టించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నరేష్ బాబు, కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, సునేంద్ర, సునీత నరేందర్, పద్మమ్మ పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్ పట్టణంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

అభివృద్ధి చేస్తే అద్భుతం

- జూరాల ప్రాజెక్టు వద్ద వసతులు కరువు
- ఇబ్బంది పడుతున్న పర్యాటకులు
- పాలకులు మారినా ప్రాజెక్టు పరిస్థితి మారలే..
- గుంతలమయమైన రోడ్డు
- ప్రాజెక్టుపై వెలగని లైట్లు


జూరాల ప్రాజెక్టుపై దెబ్బతిన్న ప్రహరీ 7

బీచుపల్లిలో మంత్రి దామోదర రాజనరసింహ

- కృష్ణానదిలో బాల్య స్నేహితుడి అస్థికల నిమజ్జనం
- ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


బీచుపల్లి ఆలయంలో మంత్రి దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు 6

ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలి


పార్వతమ్మతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని వడ్డెవాట గ్రామంలో రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారితో మాట్లాడారు. ఇళ్లు మంజూరైనా పనులు ఎందుకు ప్రారంభించలేదని పార్వతమ్మను ప్రశ్నించారు. ఆషాఢం మాసం నడుస్తోంది, రోజులు బాగాలేవు అందు కోసమే ఇంటి నిర్మాణం చేయలేదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంజూరు అయినా వెంటనే నిర్మాణాలు చేసుకుంటే బిల్లులు విడతల వారీగా వస్తాయన్నారు. ఆలస్యం చేస్తే మంజూరైన ఇళ్లు రద్దు అవుతాయని తెలిపారు. అదేవిధంగా పెద్దమందడి మండలంలోని వెలటూరు గ్రామంలో పద్మమ్మ ఇంటి నిర్మాణానికి కలెక్టర్ పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులతో జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి 34 ఇళ్లు మంజూరు అయ్యావని తెలిపారు. ఇంటి నిర్మాణాలు చేసుకోని ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలని ఆదేశించారు.

తుంగభద్ర నదిలో 16 కేజీల భారీ చేప లభ్యం

7

అర్హులందరికీ అభివృద్ధి ఫలాలు

గట్టు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందతాయని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం జోగుళాంబ గద్వాల గట్టు పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంజూరీ పత్రాలు పొందిన అందరు వెంటనే ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. పేదవారికి సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గట్టు మండల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, గద్వాల మార్కెట్ ఛైర్మన్ నల్ల హన్మంతు, తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడు, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ బండారి భాస్కర్ పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బీచుపల్లిలో మంత్రి దామోదర రాజనరసింహ

- కృష్ణానదిలో బాల్య స్నేహితుడి అస్థికల నిమజ్జనం
- ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ

ఎర్రవల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని పుణ్యక్షేత్రం బీచుపల్లిని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సందర్శించుకున్నారు. ఆయన బాల్యమిత్రుడు మనోహర్‌రావు మెడీ గత మార్చిలో మృతి చెందారు. ఈ సం దర్భంగా మనోహర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి బీచుపల్లికి వచ్చిన మంత్రి, అర్చకుల వేద మంత్రోచ్చారణ మధ్య కృష్ణానదిలో ఆయన అస్థికలను నిమజ్జనం చేశారు. అనంతరం వారు బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు అలయ అర్చకులు మారుతీచారి, ఈవో రామన్‌గౌడ్ మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎర్రవల్లిలోని పదవ బెటాలియన్‌కు చేరుకున్న మంత్రికి పోలీసులు గౌరవవందనం చేశారు. కార్యక్రమంలో గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, కలెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య, సీఐ రవి బాబు, ఎస్ఐ వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు బండారి భాస్కర్, గడ్డం కృష్ణారెడ్డి, తహసీల్దార్ నరేశ్ పాల్గొన్నారు.

'శూన్యం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన అరుణ్‌కుమార్ రాసిన 'శూన్యం' పుస్తకాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో పలువురు కవులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవి యాకూబ్, వనపట్ల సుబ్బయ్య, ముచ్చర్ల దినకర్, ఎదిరెపల్లి కాశన్న పాల్గొన్నారు.

22న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

కల్వకుర్తి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని అథ్లెటిక్స్ క్రీడాకారులు ఈ నెల 22న నిర్వహించే పోటీలకు హాజరు కావాలని కోరారు. వచ్చే నెల 6న హనుమకొండలోని జవహర్‌లాల్‌నెహ్రూ అథ్లెటిక్స్ ప్రధాన స్టేడియంలో 11వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పోటీలల్లో జిల్లా స్థాయిలో ఎంపికైన వారు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రాచీన కళలను కాపాడుకుందాం

- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



కళాకారులతో ఎస్పీ రావుల గిరిధర్

శ్రీరంగాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన రంగస్థల కళలను కాపాడుకోవాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శ్రీరంగాపురం మండలం వెంకటాపురం గ్రామంలో మూడు రోజులుగా ప్రదర్శిస్తున్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర (జీవ సమాధి ఘట్టం) చివరి రోజు నాటక ప్రదర్శనకు గురువారం ఉదయం ఎస్పీ పాల్గొని కళాకారుల నాటక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కళలు మానసిక ఆనందాన్ని ఇవ్వడమే గాక గొప్ప సంస్కారాన్ని ప్రబోధిస్తాయని చెప్పారు. సినిమాలు, టీవీలు, సెల్ ఫోన్లు వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించి ఎంత కాలక్షేపాన్ని అందించిన నాటక రంగం యొక్క గొప్పదనం దానిదేనని వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ నాటకంలో పాల్గొన్న పాత్రదారుల అభినయాన్ని ప్రశంసిస్తు శాలువా, పూలమాలలతో సన్మానించారు. నాటక సమాజం వారికి ఎస్పీ రూ.5వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో వనపర్తి సీఐ వెంకట్‌రెడ్డి, శ్రీరంగాపూర్ ఎస్ఐ రామకృష్ణ, యువకులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం

- సూపరింటెండెంట్ సంపత్ కుమార్ సింగ్

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా కిడ్నీ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని, దానిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సంపత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం ఆసుపత్రిలోని డయాలసిస్ యూనిట్‌లో అపెక్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జిల్లాలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉడడంతో పాటు, సరైన ఆహార నియమాలు పాటించకపోవడంతో కిడ్నీ సంబంధిత వ్యాధులు వ్యాప్తిస్తున్నాయన్నారు. ఆసుపత్రిలో ఉచిత డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, డయాలసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

మందుల కొరత లేకుండా చూడాలి

- జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్

మిడ్జిల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలోని పశువైద్యశాల, బోయిన్‌పల్లి గ్రామంలోని పశువైద్య ఉపకేంద్రాన్ని జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువైద్యశాలలో రికార్డులను పరిశీలించారు. టీకాలు, హెచ్ఎస్ గురించి డాక్టర్ అనుప శివరాజ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పశువైద్యశాలలో చికిత్సను పరిశీలించి మూగజీవాలకు అందిస్తున్న సేవల గురించి రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారులతో మాట్లడారు. పశువైద్యశాలలో మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం పాడిరైతులకు, గొర్రెలు, మేకల పెంపకం దారులకు అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం విద్యుత్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. తలకొండపల్లి నుంచి కల్వకుర్తికి కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రారంభించి స్వయంగా డ్రైవింగ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ఇబ్రహీం, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, నర్సింహ, కిషన్‌రెడ్డి, శ్రీలత, నాగార్జున, వినయ్‌సాగర్, ముంతాజ్, పార్థు, సునీత, కార్తీక్, డీఈలు శ్రీధర్‌శెట్టి, గోపాల్, ఏడీఈలు శంకరయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెరిగేదెలా?

- లైసెన్స్ లేకుండానే మునిసిపాలిటీల్లో వ్యాపారాలు
- పునరుద్ధరణకు నోచుకోని వైనం
- అమలు కానీ నూతన విధానం
- పట్టించుకోని పాలకవర్గం, అధికార యంత్రాంగం



అచ్చంపేట పట్టణ వ్యూ..

అచ్చంపేట టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనులతో పాటు, కార్యాలయాల నిర్వహణకు ఆదాయ మార్గాలను పాలకవర్గాలు, యంత్రాంగం ఎంచుకోవడం లేదు. టీ సెంటర్ నుంచి పెద్ద పరిశ్రమల వరకు ఏ వ్యాపారానికైనా వ్యాపార లైసెన్స్ తీసుకోవాలి. ఆ తర్వాత ఏటా నిర్ణీత సమయంలో ఫీజు చెల్లించి పునరుద్ధరించుకోవాలి. కానీ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ మునిసిపాలిటీలలో రెన్యూవల్ చేయించుకోకపోవడం, కొత్త ట్రేడ్ లైసెన్సుల జారీ లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. ఏటా దుకాణాలు పెరుగుతూనే ఉన్నాయి. కానీ లైసెన్సులు మాత్రం పెరగడం లేదు. అధికారులు ఏటా పాత లెక్కలు చెబుతున్నారు. బ్యాంకు రుణాలు అవసరమైన వారు మాత్రమే లైసెన్స్ తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. మునిసిపాలిటీల ఆదాయం పెంచుకునేందుకు కొత్త విధానం తీసుకొచ్చినా.. అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో అమలు కావడం లేదు. ప్రధానంగా మునిసిపల్ రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవరిస్తూన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కొత్త విధానం ప్రకారం..

కొత్త మునిసిపల్ చట్టం ప్రకారం దుకాణాల కొలతల ప్రకారం ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయాలని ఆదేశాలున్నాయి. ఇందుకు మునిసిపల్ శాఖ 147 జీవో తీసుకొచ్చింది. గతంలో దుకాణం, వ్యాపారానికి రూ.500 నుంచి రూ.1,500వరకు రుసుం ఉండేది. తాజాగా తీసుకొచ్చిన విధానం ప్రకారం పట్టణంలో సింగిల్ లైన్, డబుల్ లైన్, అంతకంటే ఎక్కువ వరుసలు నాలుగు విభాగాలు విభజించారు. ఈ రహదారుల పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాల వైశల్యాలతో ప్రతీ చదరపు అడుగుకు రూ.3 నుంచి రూ.7 వరకు లైసెన్స్ ఫీజును మునిసిపాలిటీని బట్టి నిర్ణయిస్తారు. మళ్లీ అందులో రహదారులతో సంబంధం లేకుండా పారిశ్రామిక ప్రాంతంలో నెలకొన్న వ్యాపార మిల్లులు, తాత్కాలికంగా నిర్వహించే వ్యాపారాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆస్పత్రులు విభజించి కొలతలు కొలిచి ఫీజు వసూలు చేస్తారు. దీన్ని పక్కాగా అమలు చేస్తే ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో కంటే లైసెన్స్ ఫీజులు భారీగా పెరగడంతో వ్యాపారులు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. అలాగే ఎటువంటి దుకాణమైన రూ.వెయ్యి హరిత నిధి కింద ట్రేడ్ లైసెన్స్ ఫీజుతో పాటు అదనంగా చెల్లించాల్సి ఉండటంతో వ్యాపారులు వెనకడుగు వేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్‌ల వివరాలు

మునిసిపాలిటి	ప్రస్తుత లైసెన్స్‌లు	తీసుకోవాల్సినవి	తీసుకున్న వారు
నాగర్‌కర్నూల్	1580	560	120
అచ్చంపేట	477	350	35
కల్వకుర్తి	851	455	48
కొల్లాపూర్	720	120	22

రూ.కోటికి పైగా నష్టం

జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల పరిధిలో 1,485 ట్రేడ్ లైసెన్స్‌లు ఉండగా 2024-25లో కేవలం 245 మాత్రమే రెన్యూవల్ అయ్యాయి. ఇంకా 11,240 ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ కావాల్సి ఉంది. దీంతో సుమారుగా నాలుగు మునిసిపాలిటీల్లో రూ.కోటికిపైగా ఆదాయం కోల్పోతున్నారు. ఇందులో కొన్ని ఇప్పటికే రెన్యూవల్స్ చేసుకోవాల్సి ఉండగా, మరి కొన్ని వచ్చే ఏడాది మార్చి 31 వరకే రెన్యూవల్ చేయాల్సి ఉంది.

స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం

వ్యాపారులు చట్ట ప్రకారం మునిసిపాలిటిలో షాపుల నిర్వాహకులు ప్రతి ఒక్కరు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి.ఈ ఏడాది మునిసిపాలిటిలో లైసెన్స్‌లు నమోదు చేయించేకోవాలని ఇప్పటికే ప్రతి ఒక్కరికి ఆదేశాలు అందించాం. కాలనీలలో ఉన్న షాపులకు కూడా లైసెన్స్‌లు ఇచ్చేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు సిబ్బంది నిర్వహిస్తున్నారు.



- యాదయ్య, మునిసిపల్ కమిషనర్, అచ్చంపేట

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర షెడ్యూల్డ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు జూలై 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాంలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో తెలంగాణ స్టడీ సర్కిల్‌లో 2025-26 సంవత్సరానికి సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకుని ఆసక్తి కలిగిన ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు ఈ శిక్షణకు తెలంగాణ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు జూలై 13న ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని, మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు రిజర్వు ఉంటాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు బంజారహిల్స్ స్టడీ సర్కిల్‌లో పది నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు.

అభివృద్ధి చేయాలని నిరసన తెలిపితే అరెస్టులా?



అమ్రాబాద్‌లో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

అమ్రాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని నిరసన చేస్తే పోలీసులు తమను అడ్డుకొని అరెస్ట్ చేయడం సరైనది కాదని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. అమ్రాబాద్ మండల కేంద్రానికి రహదారి వేయాలని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అరెస్టులు చేస్తే ఊరుకోబోమని, సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజు, శంకర్ గౌడ్, పరమేష్ గౌడ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

లోకల్ ఫైట్‌లో నువ్వా.. నేనా..



హన్వాడ మండలం గుడిమల్కాపూర్ పంచాయతీ కార్యాలయం

(5వపేజీ తరువాయి)

ఎన్నికలలో అధికార పార్టీకి విజయం నల్లేరుమీద నడకే కావాలి. అయితే అధి కార పార్టీ ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా ఉండటం, అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నర కాలంలో రెండో శ్రేణి నాయకులను పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేకపో వడంతో కేడర్‌లో అంతర్గతంగా అసంతృప్తి ఉందన్న విషయం బహిరంగ రహస్యమే.

ఇప్పుడు అధికార పార్టీకి ఇదే ప్రధాన సమస్యగా మారింది. ఎమ్మెల్యేల తీరు, ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతనే తమకు అనుకూలిస్తుందని ప్రతిపక్షాలు లెక్కలేసుకుంటున్నాయి. ప్రతిపక్షాలు కూడా స్థానిక ఎన్నికలో సత్తా చాటాలని ఇప్పటికే ఆ పార్టీ నాయకత్వాలు నాయకులకు పిలుపునిచ్చాయి.

మునిసిపాలిటీల ఏర్పాటుతో...

ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొద్దిరోజుల క్రితం పాలమూరు మునిసిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో మహబూబ్‌నగర్ మండల పరిధిలోని దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామపంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేయగా, దేవరకద్రను మునిసిపాలిటీగా చేయడంతో దేవరకద్ర మేజర్ గ్రామపంచాయతీతో పాటు మీనుగోనిపల్లి, చౌదర్‌పల్లి, బల్సుపల్లి, పెద్దగోప్లాపూర్ గ్రామాలతో దేవరకద్ర మునిసిపాలిటీగా మార్చారు. దేవరకద్ర 12 ఎంపీటీసీ స్థానాలతో పాటు చౌదర్‌పల్లి ఎంపీటీసీ స్థానం మునిసిపాలిటీలో కలిసింది. మద్దూరు మునిసిపాలిటీలో మద్దూర్ మేజర్ గ్రామపంచాయతీతో పాటు రెనివెట్ల, నాగంపల్లి, దీంపూర్, నాగంన్‌పల్లి, సాపన్‌చెరువు, ఎర్రగుంటతండాలు కలిసి మద్దూర్ మునిసిపాలిటీగా ఏర్పాటుకాగా, మద్దూర్, రేనివెట్ల ఎంపీటీసీ స్థానాలు మునిసిపాలిటీలో కలిశాయి. ఇప్పుడు ఈ గ్రామాలకు సర్పంచ్ ఎన్నికలకు బదులు కౌన్సిలర్ ఎన్నికలు జరగనున్నాయి.

పల్లెల్లో మొదలైన రాజకీయం

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల హడావిడి మొదలవడంతో పల్లెల్లో రాజకీయం వేడెక్కుతోంది. ఇప్పటికే ఎన్నికల్లో పోటీచేసే ఆశావహులు ఓటర్లను మచ్చిక చేసుకునే కార్యక్రమాలు మొదలుపెట్టారు. సర్పంచ్‌కు నాయకుల మధ్య పోటీ ఎక్కువగా ఉన్నచోట ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ తమకే టికెట్ ఇవ్వాలని పైరవీలు చేసుకుంటున్నారు. ప్రతిపక్షాలు కూడా పార్టీ నుంచి టికెట్ తనకే ఇవ్వాలని నేతల వద్ద మంతనాలు సాగిస్తున్నారు. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీలో కూడా పోటీచేసే ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఇక మునిసిపాలిటీలకు మాత్రం పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలు ముగిసిన తరువాతనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. వార్డుల విభజనతో ఇప్పటికే మహబూబ్‌నగర్ కార్పొరేషన్, దేవరకద్ర, మద్దూర్ మునిసిపాలిటీలలో రాజకీయ సందడి మొదలైంది. పాలమూరులో డివిజన్‌ల విభజనపై ఇప్పటికే ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేయడం జరిగింది. ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహించిన అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగింది. ఇప్పటికే బ్యాలెట్ నమూనాలు, గుర్తులను కూడా ఎంపిక చేసి సిద్ధం చేశాం. జిల్లాలో గతంలో కన్నా మునిసిపాలిటీలు ఏర్పాటు కావడంతో 184 పంచాయతీలకు గాను 175 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

- పార్థసారథి, పంచాయతీ అధికారి మహబూబ్‌నగర్

దాడి కేసులో నిందితులకు జైలు శిక్ష

- తీర్పు అనుకూలంగా రాకపోవడంతో కోర్టు ఆవరణ నుంచి ఓ నిందితుడు అదృశ్యం
- పోలీసులు అప్రమత్తమై, రెండు గంటల్లో అదుపులోకి..

గద్వాల సర్కిల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసిన కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తులు కింది కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ జిల్లా కోర్టుకు వెళ్లారు. అయితే నిందితుల అప్పీల్‌ను జిల్లా కోర్టు తిరస్కరిస్తూ కింది కోర్టు తీర్పునే సమర్థించి నిందితులకు రెండేళ్ల రెండు నెలల తీర్పుతీర్పు ఇచ్చింది. గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోదాచారిల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గట్టుకు చెందిన గూడూరు నాగరాజు మండలంలోని తన 35 గుంటల వ్యవసాయభూమిలో 2016లో గట్టుకే చెందిన అన్నదమ్ములైన ఎస్ కృష్ణ, చిన్న మూకన్న, పెద్ద మూకన్న, గుండన్న పొలంలోకి అక్రమంగా భూమిని దున్నడంతో పాటు నాగరాజుపై అకారణంగా దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై గట్టు పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసుకు విచారణ చేపట్టిన గద్వాలలోని ప్రథమ శ్రేణి న్యాయాధికారి 2024లో నలుగురు అన్నదములకు సాక్ష్యాధారాలు పరిశీలించి న్యాయాధికారి ఒక్కొక్కరికి రెండేళ్ల రెండు నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. అయితే ఈ కేసులో నిందితులుగా నలుగురు అన్నదమ్ములు ప్రథమ శ్రేణి న్యాయాధికారి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకున్నారు. కోర్టులో విచారణ చేపట్టిన జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రేమలత నిందితులు చేసుకున్న అప్పీల్‌ను తిరస్కరిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ అదే తీర్పును ఖరారు చేసినట్లు సీఐ చెప్పారు.

కోర్టు నుంచి అదృశ్యమైన నిందితుడు

తీర్పు తమకు అనుకూలంగా వస్తుందని భావించిన నిందితుల్లో ఒకరైన ఎస్ కృష్ణ ఉన్నపలంగా కోర్టు ఆవరణ నుంచి సెల్‌లో మాట్లాడుతూ అదృశ్యమయ్యాడు. అప్రమత్తమై పోలీసులు అతడి కోసం కోర్టు పరిసర ప్రాంతాల్లో గాలించారు. రెండు గంటల సమయం తర్వాత అదుపులోకి తీసుకున్నారు. తనకు కడుపు నొప్పి రావడంతో అలా బయటికెళ్లానని, తాను ఎక్కడికి పారిపోలేదని పోలీసులకు కృష్ణ చెప్పినట్టు తెలిసింది. జిల్లా కోర్టు ఆదేశానుసారం నలుగురు నిందితులకు రిమాండ్‌కు తరలించినట్టు సీఐ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇదిలా ఉండగా తీర్పు రాగానే ఓ నిందితుడు గాయాబ్ కావడం.. రెండు గంటల వ్యవధిలో ప్రత్యక్షమైన ఘటన గురువారం జిల్లా అంతటా సంచలనంగా మారింది.

నవోదయ పాఠశాల ప్రారంభమయ్యేనా?

- తాత్కాలిక భవనం కోసం ఏర్పాట్లు
- ఇంకా పూర్తి కాని స్థల సేకరణ
- ప్రారంభం కాని తరగతులు



సల్కర్‌పేట వరహగిరిపల్లి వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం పాలమూరు జిల్లాకు మంజూరైంది. కానీ భవనం లేకపోవడంతో ఇప్పటికి ప్రారంభానికి నోచుకోలేదు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఆరో తరగతి ప్రవేశాలు చేసుకునేందుకు అనుమతి కూడా వచ్చింది. 2025-26 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు 40 సీట్లు భర్తీ చేసుకునేందుకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అన్నివిధాల ఏర్పాట్లు చేయకపోవడంతో విద్యా ఏడాది ప్రారంభం కాలేదు. తాత్కాలిక భవనం దొరకక పోవడంతో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లాలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలు పూర్తి చేసుకుని, జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. పాలమూరు జిల్లాలో నవోదయ పాఠశాల తాత్కాలిక భవనం ఏర్పాటు చేసేందుకు జిల్లా కేంద్రం బండమీదిపల్లెలోని సైనిక్ భవన్ సమీపంలోగల పాత కేజీబీవీ భవనం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నటు తెలుస్తుంది. మంగళవారం ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ భవనాన్ని పరిశీలించారు.

స్థల పరిశీలన చేసిన అధికారులు

భూ సేకరణ కోసం అధికారులు మహబూబ్‌నగర్, హన్వాడ, గండీడ్, మహమ్మదాబాద్ మండలాల్లో అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో సరిపడా స్థలం ఇక్కడ లేక పోవడంతో, గండీడ్ మండలంలోని సల్కర్‌పేట సమీపంలో వరహగిరిపల్లి వద్ద అధికారులు స్థల పరిశీలన చేశారు.

మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ గ్రామంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధికారులతో కలిసి స్థలం పరిశీలించారు.

నవోదయలో చదివేందుకు పోటీ

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో చదుకునేందుకు ఆరో తరగతి ప్రవేశాల కోసం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. మెరిట్ సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు.

ఈ ప్రవేశాలకు తీవ్ర పోటీ ఉంటుంది. ఈ పాఠశాలలో సీటు రావడం విద్యార్థులకు వరంలాంటిది. జాతీయ స్థాయి కరికులంలో 6 నుంచి 12వ తరగతి వరకు విద్యను అందిస్తారు. అంతే కాకుండా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారు. ఆరో తరగతి నుంచి ఒక్కో తరగతి పెంచుతూ 12వ తరగతి వరకు చదువుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక్కసారి సీటు సాధిస్తే విద్యార్థి 12 వ తరగతి వరకు ఉచితంగా చదువుకునే అవకాశం ఉంటుంది.

భవనాలు చూపించలేదు

మహబూబ్‌నగర్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం మంజూరై, ఆరో తరగతికి సంబంధించి 40 సీట్లు ఉన్నాయి. భవనం లేక తరగతులు ప్రారంభించలేదు. ఇప్పటికీ జిల్లా అధికారులు తాత్కాలిక భవనం చూపించలేదు. 40 మంది విద్యార్థులకు సరిపడా వసతి, భోజనశాల, ఉపాధ్యాయులకు వసతి కేటాయిస్తే ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకుంటాం. ఈ విద్యాసంవత్సరం నుంచే ఆరో తరగతిని ప్రారంభిస్తాం. అదేవిధంగా కొత్త భవన నిర్మాణం కోసం అనువైన ప్రాంతం రోడ్డుకు దగ్గరలో సూమారు 30 నుంచి 35 ఎకరాలు కేటాయిస్తే, ఉన్నతాధికారుల అనుమతి తీసుకుఒని భవన నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తాం.

- భాస్కర్‌కుమార్, ఇన్‌చార్జి, నవోదయ పాఠశాల

క్రైం కార్నర్

ముష్టిపల్లిలో క్షుద్ర పూజల కలకలం

» ఆస్తి కోసం తల్లీ, తమ్ముడి పన్నాగం



చెరువు వద్ద గుమిగూడిన గ్రామస్థులు

పెద్దకొత్తపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఊర చెరువులో క్షుద్ర పూజలు జరిగిన విషయం గురువారం వెలుగు చూసింది. ఈ ఘటనతో గ్రామంలో జనం భయాందోళనకు గురయ్యారు. గ్రామంలో ఆస్తి విషయంలో కుటుంబ సభ్యులతో పెద్ద కుమారుడు కుర్మయ్యకు కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. తల్లి భార్యమ్మ, తమ్ముడు శ్రీశైలం ఓ మాంత్రికుడి సహాయంతో బుధవారం రాత్రి ఊర చెరువు వద్ద క్షుద్ర పూజలు చేశారు. గురువారం ఉదయం గ్రామ యువకులు బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లడంతో విషయం తెలిసింది. గ్రామస్థులతో కలిసి క్షుద్ర పూజల్లో వాడిన వస్తువులను స్వాధీనం చేసుకుని కుర్మయ్య ఇంటికి తెచ్చారు. విషయం బయట పడడంతో తల్లి భార్యమ్మ, తమ్ముడు శ్రీశైలం ఇంటికి తాళం వేసి పారిపోయారు.

వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలు

మానవపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు పెరిగిపోయాయి. మండలంలోని చెన్నిపాడు గ్రామంలో బుధవారం రాత్రి పలు కాలనీల్లో ఆరుబయట నిద్రిస్తున్న పింజరి మాబి, చాకలిరాజు, బోయ నందుపై కుక్కలు దాడి చేశాయి. అదేవిధంగా శుభకార్యానికి వచ్చిన గూడుమియ్యపై దాడి చేయగా కర్నూల్‌కి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, పంచాయతీ అధికారికి చెబుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు.

పెద్దవడ్డెమాన్‌లో ..

చిన్నచింతకుంట (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని పెద్దవడ్డెమాన్ గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా 15 కుక్కలను మునిసిపల్ సిబ్బంది పట్టుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీ - ఒకరికి గాయాలు

వంగూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్, బైక్ ఢీ కొని ఒకరికి తీవ్రంగా గాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని కోనాపూర్‌తండాకు చెందిన రామావత్ శ్రీనునాయక్ రంగాపూర్ నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. రంగాపూర్‌తండా సమీపంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనునాయక్‌కు చేతులు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తండా వాసులు తెలిపారు.

విద్యుత్ మోటార్ వైర్లు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఇందుకు సంబంధించి నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని దేశి ఇటిక్యాల రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి కలెక్టర్ కార్యాలయం వెనుక భాగంలో కేఎల్ఐ కాల్వకు అనుసరించి ఉన్న రైతుల పొలాలకు సంబంధించిన విద్యుత్‌స్తంభాలకు అమర్చిన కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారు. తాపీగా ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి సుమారు ఆరు విద్యుత్ స్తంభాలకు కేబుల్‌ను కత్తిరించుకొని వెళ్లిపోయారు. దీంతో ఈ ప్రాంతంలోని సుమారు 30 మంది రైతుల పొలాలకు విద్యుత్ మోటార్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వారం రోజుల క్రితం అదే గ్రామంలోని ప్రధాన రహదారికి దగ్గరలో ఉన్న రైతుల పొలాలకు చెందిన విద్యుత్‌స్తంభాలను దొంగలించినట్లు రైతులు వాపోయారు. గతంలో విద్యుత్ తీగల దొంగలించిన వ్యక్తులను విచారించాలని, అదేవిధంగా సీసీ కెమెరాలు ద్వారా దొంగలను గుర్తించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి

» కంటతడి పెట్టిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


వంగూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వంగూరు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పాండురంగారెడ్డి (55) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం మిట్టసదగోడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరగా, గురువారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సంతాపం తెలిపి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే కంటతడి పెట్టారు. అదేవిధంగా రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు కే.వీ.ఎన్.రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దకొత్తపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో చొప్పరి బాలస్వామికి చెందిన గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. గురువారం గ్రామశివారులో మేపేందుకు గేదెలు తీసుకెళ్లాడు. గాలులకు వైర్లు తెగిపడ్డాయి. వైర్లకు గేదె తగలడంతో షాక్ గురై మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

» విద్యాశాఖ కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్



రికార్డులను పరిశీలిస్తున్న విద్యాశాఖ కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్

అచ్చంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని విద్యాశాఖ కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని పెనిమిళ్ల జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 13న గ్రామంలోని పాఠశాలను పరిశీలించిన గ్రామస్థుల వినతి మేరకు ఆయన వచ్చారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదులను గ్రామస్థులు చూయించారు. వంట గదులను, వినియోగంలో లేని మూత్రశాలలను పరిశీలించారు. పదవ తరగతిలో 500పైగా మార్కులు వచ్చిన విద్యార్థులను ఆయన సన్మానించారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, అంజి, మల్లయ్య, శ్రీనివాస్‌గౌడ్, విజయ్, శ్రీను, శేఖర్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తే అద్భుతం



జూరాల ప్రాజెక్టుపై గుంతలమయంగా ఉన్న రహదారి



జూరాల ప్రాజెక్టు పుష్కర ఘాట్ వైపు వెళ్లే రహదారి దుస్థితి

» జూరాల ప్రాజెక్టు వద్ద వసతులు కరువు

» ఇబ్బంది పడుతున్న పర్యాటకులు

» పాలకులు మారినా.. పరిస్థితి మారలే..

» గుంతలమయమైన రోడ్డు

» లైట్లు వెలగకపోవడంతో అంధకారం

అమరచింత, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిపై రాష్ట్రంలోనే తొలి ప్రాజెక్టుగా ప్రసిద్ధిగాంచిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది. ప్రాజెక్టు దుస్థితిపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వాలు మారిన ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఏమాత్రం వసతులు కల్పించలేదు.

నిలువ నీడ లేదు

ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువన శ్రీశైలంకు నీటిని వదిలినప్పుడు ఈ సుందర దృశ్యాన్ని తిలకించడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. కనీసం పర్యాటకులు నిలిచి ఉండడానికి ఒక షెడ్డు కూడా నిర్మించలేదు. కనీసం ప్రాజెక్టు సమీపంలో తాగునీటి వసతి సమకూర్చకపోవడంతో పర్యాటకులు సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది.

మంత్రి దృష్టి సారించాలి

జూరాల ప్రాజెక్టు వద్ద వసతులపై కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరి దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కనీసం చిన్న పిల్లలు, వృద్ధులకు తాగడానికి నీటి సౌకర్యం లేదు. మహిళలకు అక్కడికి వచ్చే పర్యాటకులకు మూత్రశాలల సౌకర్యం లేదు. పర్యాటకుల సౌకర్యార్థం మంత్రి ప్రత్యేక నిధులతో వసతులను ఏర్పాటు చేసి పర్యాటకుల ఇబ్బందులను తీర్చాలని కోరుతున్నారు.

రూ.120 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి



జూరాల ప్రాజెక్టు సేఫ్టీ, పర్యాటకుల వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే డ్యాంపై భారీ వాహనాల రాకపోకలతో మనుగడ ఇబ్బంది కలుగుతూనే ఉంది. రూ.120 కోట్లతో ప్రత్యేక డిజైన్లతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. కుడి భాగంలో రూ.15 కోట్లతో టూరిజం వారి ఆధ్వర్యంలో పర్యాటక కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఎడమ వైపు కూడా పర్యాటక అభివృద్ధితో పాటు అక్కడి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్తాం. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రాజెక్టు సేఫ్టీగా ఉంటుంది. పర్యాటకుల వసతులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- జుబేర్ అహ్మద్, ఈఈ జూరాల ప్రాజెక్టు

అంధకారంలో పరిసరాలు

ఎడమ, కుడి భాగాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు పెద్ద డూమ్ లైట్లు ఏర్పాటు చేసినా అవి మాత్రం వెలగడం లేదు. పర్యాటకులు సాయంత్రమైతే చీకటిలో ఉండలేక వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. కనీసం ప్రాజెక్టుపై గద్వాల జిల్లా వైపు వెళ్లే ప్రయాణికులకు, ఆలస్యంగా వచ్చే పర్యాటకులకు అంధకారంలో ఉండే పరిస్థితి ఏర్పడింది.

ప్రాజెక్టుపై విద్యుత్ దీపాలు వెలగక పోవడం, అధికారుల పర్యవేక్షణలోపంతో ఆకతాయిలు, మద్యం తాగే వారి సంఖ్య దినదినం పెరుగుతుంది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ముళ్ల కంచెలు, చెత్తాచెదారం, గుంతలమ యమైన రోడ్లు అనేక సమస్యలు ప్రాజెక్టు వద్ద కనిపిస్తాయి.

రిజర్వాయర్ కోసం భూసేకరణ సర్వే

» నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో మొదటి రిజర్వాయర్‌గా ఊట్కూర్ చెరువు



చెరువు వెనుక భాగంలో సర్వే చేస్తున్న అధికారులు

ఊట్కూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా మొదటి రిజర్వాయర్‌గా మారుతున్న ఊట్కూర్ చెరువులో నీటి నిల్వకు తగ్గట్టుగా భూ సేకరణకు గురువారం రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్‌అధికారులు సర్వే చేపట్టారు. మొదటి రోజు లక్ష్మీపల్లి, దంతన్ పల్లి శివారు భూముల్లో సర్వే నిర్వహించా రు. చెరువు విస్తీర్ణం పెరుగుతుండడంతో సుమారు 312 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు తహసీల్దార్ చింతరవి తెలిపారు. ఊట్కూర్‌తో పాటు దంతన్‌పల్లి, లక్ష్మీపల్లి, నిడుగుర్తి, తిప్రాస్‌పల్లి, బాపూర్, గ్రామాల భూములు ముంపునకు గురవుతున్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఆయకట్టు పెరుగుతుండడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి వెనుక భాగంలో ముంపునకు గురయ్యే భూమిలో సర్వే చేస్తున్నట్లు వివరించారు. సర్వే నెంబర్ల ఆధారంగా భూములు ఏ రైతుకు చెందినది? ఎన్ని ఎకరాలు ముంపులో పోతుందో? సర్వే తర్వాత అధికారులు తేలుస్తారని వివరించారు. భూ సేకరణ కోసం వచ్చే అధికారులకు రైతులందరూ సహకరించాలని కోరారు. భూమి కోల్పోతున్న వారికి అధిక మొత్తంలో నష్ట పరిహారం ఇవ్వాలని అధికారుల దృష్టికి రైతులు తీసుకొచ్చారు. మొదటి రోజు సర్వే పోలీసుల బందోబస్తు నడుమ కొనసాగింది. డీఈ వెంకటరమణ, ఏఈ ఖాజమైనోద్దీన్, సర్వేయర్లు జయశంకర్, రాజన్న, ఆర్ఐ వెంకటేష్, కృష్ణారెడ్డి, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెద్ద ధన్వాడలో పండుగ వాతావరణం

» జైలు నుంచి రైతులు విడుదల కావడంతో గ్రామంలో ఏరువాక వేడుకలు

» సుంకులమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న గ్రామస్థులు



పెద్ద ధన్వాడలో సుంకులమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

రాజోలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పోరాటం చేసి జైలుకెళ్లిన రైతులు విడుదల కావడంతో గ్రామంలో వారం తర్వాత ఏరువాక వేడుకలు నిర్వహించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ శివారులో 14 రోజుల క్రితం ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించి నిర్మాణ పనులు అడ్డుకునేందుకు ప్రయత్నించిన 12 మంది రైతులను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. వారు బుధవారం రాత్రి విడుదల కావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆగిపోయిన ఏరువాక పండుగను చేసుకోవాలని తీర్మానించుకుని గురువారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాడెద్దులకు పక్కనే ఉన్న తుంగభద్ర నదిలో స్నానం చేయించి, బొట్లు పెట్టి పూజలు చేశారు. అదేవిధంగా సుంకులమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన శిక్షణ ఐఏఎస్‌లు



ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో శిక్షణ ఐఏఎస్‌లు, జెన్‌కో అధికారులు

దోమలపెంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రాన్ని శిక్షణ ఐఏఎస్‌లు హర్ష చౌదరి, సౌరభ్ శర్మ, సలోని చబ్రా, కరోలియన్ చింగ్‌తి అన్మవి, కొయ్యాడ ప్రణయ్ కుమార్ గురువారం సందర్శించారు. వీరికి జెన్‌కో డైరెక్టర్ సచ్చిదానందం, జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు విద్యుత్ కేంద్రాన్ని కలియ తిరిగి చూపించారు.

గతంలో అగ్ని ప్రమాదానికి గురైనా నాలుగో యూనిట్ మరమ్మతు పనులను పరిశీలించారు. భూగర్భ విద్యుత్ కేంద్రం పని తీరును సీఈ వివరించారు. ముఖ్యంగా ఇక్కడ పంపు మోడ్ విధానంలో విద్యుత్ తయారు చేయడం ప్రత్యేకత అని వారికి వివరించారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం సందర్శన ఎప్పటికీ మరుపురాని జ్ఞాపకంగా ఉంటుందని శిక్షణ ఐఏఎస్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ శ్రీనివాస్, జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పీయూ అధ్యాపకుడు గాలన్నకు డాక్టరేట్



గాలన్నను అభినందిస్తున్న వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు, అధ్యాపకులు

పాలమూరు యూనివర్సిటీ/ పెద్దకొత్తపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలోని సామాజిక శాస్త్ర విభాగ అధ్యాపకుడు గాలన్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు గురువారం ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు ప్రకటించారు. ప్రొఫెసర్ హన్నా ఆనంద్‌రాజు, డాక్టర్ బీనవేణి రామ్ షఫర్డ్ పర్యవేక్షణలో 'ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రైతుల ఆత్మహత్యలు' అంశంపై పరిశోధన పత్రాలను సమర్పించారు. అందుకుగాను గాలన్నకు డాక్టరేట్ ప్రకటించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయ కుటుంబానికి చెందిన గాలన్న పీయూలో అధ్యాపకుడిగా పనిచేస్తూ పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అభినందించారు. వీసీ మాట్లాడుతూ పరిశోధన ఫలితాలు సమాజానికి అందించాలని, రైతే రాజు కావాలని అన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. ప్రస్తుతం వార్డెన్‌గా, ప్రోగ్రామ్ అధికారిగా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తూ ప్రజలను, విద్యార్థులను చైతన్యవంతులను చేస్తున్నారని కొనియాడారు. అనంతరం గాలన్న మాట్లాడుతూ డాక్టరేట్ పూర్తి కావడంలో సహకరించిన అధ్యాపకులు, కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కృష్ణయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో జాతీయ స్థాయికి ఎదగాలి

» ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్పీ. వెంకటేశ్

» ఉత్సాహంగా జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్‌లో క్రీడాకారులు రాణించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్పీ. వెంకటేశ్ అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 28 నుంచి జూలై 1వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలుర జట్టు ఎంపికలను గురువారం జిల్లా స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫుట్‌బాల్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన 25 మందిని ఎంపిక చేశామని, శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్. రంగారావు, జీ. భానుకిరణ్, నగేష్, ఇమ్మనుయ్యల్ జేమ్స్, నందకిశోర్, శ్రీనివాస్, వాజిద్, నీకేష్, రాజు, రాము, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నదిలో భారీ చేప లభ్యం



నదిలో లభించిన చేపను చూపిస్తున్న ఎర్రన్న

రాజోలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులోని తుంగభద్ర నదిలో గురువారం 16 కేజీల చేప మత్స్యకారులకు లభించింది. వారం రోజులుగా తుంగభద్ర నదికి వరద వస్తుండటంతో సుంకేసుల డ్యాం గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం మధ్యాహ్నం వరద ప్రవాహం తగ్గడంతో జలాశయం గేట్లు ఒక్కసారిగా మూసివేయడంతో మత్స్యకారులు నదిలో చేపల వేటకు వెళ్లారు. అక్కడ 11 కేజీలు, 13 కేజీలు, 16 కేజీల పెద్ద పెద్ద చేపలు జాలర్లకు లభించాయి. ఇందులో 16 కేజీల పెద్ద చేప ఎర్రన్నకు లభించగా, వాటిని గురువారం సాయంత్రం రాజోలిలోని చేపల మార్కెటుకు తీసుకొచ్చారు. ఈ చేపలు కింద ఉన్న శ్రీశైలం డ్యాం నుంచి ఎగువకు వచ్చాయని మత్స్యకారులు తెలిపారు.

73 మిలియన్ యూనిట్లకు చేరిన విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రంలో గురువారం నాటికి 73 మిలియన్ యూనిట్లు రాబట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 30వేల క్యూసెక్కుల వరద రావడంతో ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 11 యూనిట్లు ప్రారంభించి ఉత్పత్తి చేపడుతున్నట్లు తెలిపారు. ఎగువ ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 3.360 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి రాబట్టగా, దిగువ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 3.723 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టారు. ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తున్న కారణంగా ఉత్పత్తి వేగం పుంజుకుందని తెలిపారు. ఇదే కొనసాగితే తొందరలోనే నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

చికెన్ సెంటర్‌లో గ్యాస్ లీకై మంటలు

అలంపూర్ చౌరస్తా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఉండవెల్లి మండలంలో మారమునగాల-1లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ లీకై నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి మద్దిలేటి చిన్న గుడిసెలో చికెన్ సెంటర్ నడుపుతూ అందులోనే జీవనం సాగిస్తున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్‌కు నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికంగా ఉన్న వారు మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన లాభం లేకపోయింది. దీంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. 20 కోళ్లు, వంట సామగ్రి, నిత్యవసర సరుకులు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఎంజేపీలో మిగిలిన సీట్ల కోసం అడ్మిషన్లు

ధరూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి, రెండవ విడతలో అడ్మిషన్లు ముగిసాయని, మిగిలిన సీట్లు కోసం స్పాట్ అడ్మిషన్ల కోసం ఇంటర్మీడియట్ విద్యార్థినీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బంగి హుసేనప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు 2025 మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత, ఇంగ్లిష్ సబ్జెక్టులో 50శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అడ్మిషన్ల కోసం హాజరయ్యే విద్యార్థినులు ఇంటర్ మెమో, ఎస్ఎస్‌సీ మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బోనఫైడ్ పత్రాలను తీసుకురావాలని తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి

● మండల పశు వైద్యాధికారి స్వరూప రాణి

వడ్డేపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పశువులకు ముద్ద చర్మవ్యాధి, గొంతువాపు, జబ్బవాపు వ్యాధుల సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించి పశుసంపదను కాపాడుకోవాలని మండల పశువైద్యాధికారిని స్వరూపరాణి రైతులు, పాడి యజమానులకు సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం వడ్డేపల్లి మండలం గ్రామంలోపశువులకు టీకాల శిబిరం నిర్వహించారు. శిబిరంలో 36మంది రైతులకు చెందిన ఆవులు, దూడలు, కోడెలు, ఎద్దులు 105, గేదెలు 157 మొత్తం 262 పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు వేశామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌వో వరప్రసాద్, ఎల్ఎస్ఏలు లతీఫ్, బుచ్చమ్మ, ఓఎస్ , వెంకటమ్మ, కృష్ణ ఉన్నారు.

● ధరూరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి వెంకటరాజు రైతులు, పాడి యజమానులకు సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ధరూరు మండలం బూరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన శిబిరంలో 185 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది పవన్, రంగస్వామి, రషీద్, రైతులు ఉన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి



రాజోలి ఎంపీడీవో ఖాజామొయినుద్దిన్‌కు వినతిపత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

రాజోలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం రాజోలిలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఖాజామొయినుద్దిన్‌కు రాజోలి పారిశుధ్య కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా వేతనాలు అందించడం లేదన్నారు. గతంలో సర్పంచులు, వార్డు మెంబర్లు ఉన్న సమయంలో పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచుతూ తీర్మానించారని, పెంచిన వేతనాలు కూడా ఇవ్వడంలేదన్నారు. పెండింగ్ వేతనాలు, పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వినతిపత్రం ద్వారా కోరారు. కార్యక్రమంలో తెలంగాణ పారిశుధ్య కార్మికులు మండల కార్యదర్శి లక్ష్మన్న, కార్మికులు సత్తార్‌పాషా, రాజు, అశోక్, సుందర్ రాజు, రవి పాల్గొన్నారు.

పుల్లూరు శివారులో భూమి పరిశీలన



పుల్లూరులో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రభాకర్

ఉండవల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లూరు గ్రామంలోని సర్వే నెంబర్ 250లో ఉన్న భూమిని గురువారం తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ, సర్వేయర్‌తో కలిసి పరిశీలించారు. సంబంధిత స్థలంలో రేకులషెడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో అధికారులు అక్కడి చేరుకుని భూమి సర్వే పూర్తయిన తర్వాత మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కాగా, ఆ ప్రాంతంలో చేపడుతున్న పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

నవోదయకు ఎంపిక

గద్వాల సర్కిల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వట్టెం నవోదయ విద్యాలయం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి గద్వాలకు చెందిన అద్దంకి అరవింద్ ఇంటర్ విద్యకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అక్షర పాఠశాల కరస్పాండెంట్ పత్తి శ్రీధర్, డైరెక్టర్ హరిత, ప్రిన్సిపాల్ రత్నం గురువారం అభినందించారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదినం

● యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



గద్వాలలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గద్వాల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకను ఆ పార్టీ నాయకులు గురువారం పట్టణంలోని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖయ్యూం, జిల్లా అధ్యక్షుడు తిరుమలేశ్, నాయకులు మధు సూదన్‌బాబు, మోహన్‌రావు, రాజశేఖర్‌రెడ్డి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సీనియర్ నాయకుడు, న్యాయవాది మధు సూదన్‌బాబు మాట్లాడుతూ జోడో యాత్ర ద్వారా ప్రజల్లో సమైక్యతా భావాన్ని పెంపు చేసిన రాహుల్‌గాంధీ రాజకీయాల్లో విశ్వసనీయతను, ప్రజాజీవితంలో నిబద్ధతను చాటిన నిజమైన నాయకుడని అన్నారు. ఆయన నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ నాయకులు జిల్లా ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఇసాక్, నాయకులు డీఆర్ శ్రీధర్, లత్తిపురం వెంకట్రామి రెడ్డి, ఆనంద్‌గౌడ్, ధరూర్ రవి, భాస్కర్‌యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ఖలీం, రాజేష్, పురుషోత్తం, జగదీశ్ ఉన్నారు.

● కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన

▸▸ అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప

అయిజ : కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే దేశంలో ప్రజాస్వామ్య ప్రజాపాలన సాధ్యం అవుతుందని అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప అన్నారు. గురువారం కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధి జన్మదినాన్ని పట్టణంలోని రైతు సంఘ కార్యాలయంలో జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు కేక్ తినిపించుకుని సంబురాలు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య ప్రజా పాలన సాగిస్తున్నాడన్నారు. రైతులు, ప్రజా సంక్షేమం కోరి ముందుకు వెళుతున్నారని తెలిపారు. విద్యకు ప్రాముఖ్యత ఇస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల మద్దతు కూడగట్టుకుని ముందుకు వెళుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రాహుల్‌గాంధీ మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, కాంగ్రెస్ నాయకులు రంగు శ్రీధర్, నాగిరెడ్డి, రాజునారాయణ, దేవరాజు, షైనర్ బాబు, దేవేంద్ర, బసవరాజు, రఘుగౌడు, బాస్కర్‌గౌడులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షెక్షావలిఆచారి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్వకేట్ మధు ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.



అయిజలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎర్రవల్లి కూడలిలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు

ఎర్రవల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఎర్రవల్లి చౌరస్తా ప్రధాన కూడలిలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సోమనాద్రి, వెంకటేశ్, వెంకటన్న, అంజి, ప్రభాకర్, యువరాజ్ ఉన్నారు.

నమ్మకంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో చేరిక



తిమ్మాజిపల్లె పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో, హెచ్‌ఎం

● ఎంఈవో నరసింహులు

● ఘనంగా అక్షరాభ్యాసం

వడ్డేపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న నమ్మకంతోనే విద్యార్థులు చేరుతున్నారని మండల విద్యాధికారి నరసింహులు అన్నారు. పాఠశాల పదవ సంవత్సరంలోని అడుగుపెడుతున్న సందర్భంగా గురువారం తిమ్మాజిపల్లి ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఎంఈవో మాట్లాడుతూ గత పదేళ్లుగా పాఠశాల నుంచి ఏ ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ఇక్కడే చదవడం ఎంతో సంతోషకరమన్నారు. ఈక్రమంలో తిమ్మాజిపల్లి పీఎస్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, గ్రామస్థులంతా ఏకమై తీసుకున్న నిర్ణయంతోనే ఇది సాధ్యపడిందన్నారు. ఇందుకు కారణమైన గ్రామస్థులను, యువకులను, తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు,యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదయ్య, ఉపాధ్యాయులు దేవేందర్, వెంకట్‌రాములు, దస్తగిరి, గ్రామ యువకులు నాగేశ్‌యాదవ్, గౌనింటి వీరేశ్, సి.నాగేశ్, లక్ష్మన్న, కుమార్, తల్లిదండ్రులు ఉన్నారు.

క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థిని ఎంపికను పరిశీలిస్తున్న డీవైఎస్‌వో జితేందర్

● డీవైఎస్‌వో జితేందర్

గద్వాల అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ఎంపిక కోసం నిర్వహిస్తున్న పోటీల్లో మండలస్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని డీవైఎస్‌వో జితేందర్ తెలిపారు. ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో నాల్గవ తరగతిలో ఎంపిక కోసం గురువారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 26మంది హాజరయ్యారు. ఈ సందర్భం గా డీవైఎస్‌వో మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ ఎంపికైన వారు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, పిజికల్ డైరెక్టర్లు హైమావతి, కృష్ణయ్య, బీసన్న, అనూష, నరేష్, కవిత, రాజేంద్ర, విద్యార్థులు ఉన్నారు.

● అయిజ : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరం లో 4వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి రాములు తెలిపారు. హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ క్రీడా పాఠశాల ప్రవేశాలకు మూడంచెల విధానం అమలులో ఉంటుందన్నారు. జూన్ 20 శుక్రవారం మండల స్థాయి ఎంపిక ఉంటుందని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులు జూన్ 23 నుంచి 26వరకు జిల్లా స్థాయిలో గద్వాలలో జరిగే పోటీలో పాల్గొనాల్సి ఉందన్నారు. పరుగుపందెం, షటిల్ రన్, జంపింగ్, ఎత్తు, బరువుతో పాటు తొమ్మిది విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. 8నుంచి 9 సంవత్సరాల వయస్సు కలిగి విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని 20వ తేదీ శుక్రవారం అయిజ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే ఎంపిక పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

● ఉండవల్లి : ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ఎంపిక కోసం మండలంలోని పాఠశాలల్లో వివిధ క్రీడాంశాల్లో నాల్గవ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి రామకృష్ణ తెలిపారు. క్రీడా పాఠశాలల్లో ఎంపిక కోసం గురువారం ఉండవల్లి జడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో హేమలత, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీ, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఉండవల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రామకృష్ణ

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాలసర్కిల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో పలు విద్యా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గద్వాల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 2025-26, 2025-27 విద్యా సంవత్సరాలకు ఎన్సీవీటీ(నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్) ప్యాట్రన్ కింద ఇంజనీరింగ్, నాన్‌ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలకు ఈనెల 21వ తేదీలోగా ప్రభుత్వ ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండేళ్ల కోర్సులు ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్టమెన్ సివిల్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఏడాది కోర్సులు మెకానిక్ డీజిల్, కోప ట్రేడ్ ఉన్నాయని తెలిపారు.

బస్టాండ్‌ను పరిశీలించిన డీఎం సునీత

మానవపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను గురువారం గద్వాల డిపో మేనేజర్ సునీత పరిశీలించారు. గతంలో చిరువ్యాపారులకు స్థలం కేటాయించి అద్దె వసూలు చేస్తామని చెప్పిన సందర్భంలో 32మందికి స్థలం కేటాయించామని, ప్రతీ వ్యాపారి ఒక పక్క నుంచి మొదలుకొని వరుస క్రమంలో షాపులు వేసుకోవాలని సూచించారు. బస్టాండ్ ఆవరణలో మురుగు నిలువడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నరని గుంతలకు మట్టి ఏర్పాటు చేయాలని డీఎంకు వినతిపత్రం అందించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు, గ్రామీణులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● గద్వాల ఎంఈవో శ్రీనివాస్ గౌడ్



సరస్వతి పాఠశాల సమీపంలో పుస్తకాల నిల్వలను పరిశీలిస్తున్న ఎంఈవో

గద్వాల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ నిబంధనలను ఉల్లఘించే ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని గద్వాల ఎంఈవో శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు విక్రయాలు జరుగుతున్నట్లు విద్యాసంఘాలు చేసిన ఫిర్యాదు ఆధారంగా గురువారం పట్టణంలోని సరస్వతీ పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో కాకుండా సమీపంలోని వేరో ప్రైవేటు బిల్డింగ్‌లో పుస్తకాల విక్రయం జరుగుతున్నట్లు గమనించిన ఎంఈవో పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరుతూ షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఈసందర్భంగా మాట్లాడిన ఎంఈవో, క్షేత్రస్థాయిలో పరిశీలించిన విషయాలను డీఈవో దృష్టికి తెస్తామని అన్నారు.

'రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి'

ధరూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ అలివేలు మంగ సూచించారు. గురువారం మండలంలోని పార్చర్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల నుంచి 23 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేంద్ర, తిరుమలేశ్, కంప్యూటర్ ఆపరేటర్ శేఖర్ ఉన్నారు.

తోటల పెంపకంపై దృష్టి సారించాలి



ఇటిక్యాలలో నర్సరీలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

▸▸ అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

ఇటిక్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని రైతులు వినియోగించుకుని తోటల పెంపకంపై దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం ఇటిక్యాలలో నర్సరీలను , రైతులు నిర్మించుకున్న పశువుల షెడ్లను ఆయన పరిశీలించారు. రైతులు సాధారణ పంటలతో పాటు మామిడి, బొప్పాయి, బత్తాయి, ఆయిల్ ఫాం, మునగతోటలు, జామ ఇతర తోటల పెంపకంపై దృష్టి సారించి, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. పొలాల్లో నీటినిల్వకోసం ఫారంపాండ్స్, పొలాలకు వెళ్లే దారులు చేయుట, కొత్త కాలువలు తీయుటకు ఆసక్తి ఉన్న ఐదు ఎకరాల్లోపు రైతులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని చెప్పారు. ఆయన వెంట ఎంపీడీవో అజహర్ మొయిద్దీన్, ఏపీవో శివజ్యోతి, కార్యదర్శి రమేశ్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

జోగుళాంబ సన్నిధిలో ఎస్పీ ప్రత్యేక పూజలు

అలంపూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి వారి ఆలయంలో జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు గురువారం సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వీరికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి స్వామి వారి ఆలయంలో గణపతిపూజ, అభిషేకం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట అలంపూరు సీఐ రవిబాబు, ఉండవల్లి ఎస్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ శ్రీనివాసరావుకు ఆలయం వద్ద స్వాగతం పలుకుతున్న అర్చకులు

ముళ్లపొదలు తొలగించిన అధికారులు



అలంపూర్‌లోని ఆరో వార్డు టీపార్కు స్థలంలో జేసీబీతో చేపట్టిన ముళ్ల పొదల తొలగింపు పనులు

అలంపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) ఆరోవార్డుపై ఏళ్లుగా నిర్లక్ష్యం శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్థానిక మునిసిపల్ అధికారులు స్పందించారు. గురువారం ఆరోవార్డులో కమిషనర్ చంద్ర శేఖర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి ఆధ్వర్యంలో ముళ్లపొదల తొలగింపు పనులు చేపట్టారు. అలాగే టీపార్కు కోసం కేటాయించిన స్థలంలో ముళ్లపొదలను జేసీబీతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్‌బోర్డు భూముల వేలం నిలిపివేత

ఉండవల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని బొంకూరు గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్వే నెంబర్లు 61, 154, 169లకు చెందిన మొత్తం 37.32 ఎకరాల వక్ఫ్ భూమికి అధికారులు వేలంపాట నిర్వహించారు. అయితే వేలంపాట జరుగుతున్న సమయంలో కొంతమంది స్థానికులు హైకోర్టు ఇచ్చిన స్టే ఆదేశాలను అధికారులకు చూపారు. ఇది వక్ఫ్ భూమి కాదని, ఇనాం భూమి అని వారు అధికారులతో వాదించారు. స్టే ఆర్డర్ కాపీని చూసిన అనంతరం వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సిరాజ్, తహసీల్దార్ ప్రభాకర్ ఈ విషయంపై చర్చించి, అనంతరం వేలంపాటను తాత్కాలికంగా నిలిపివేశారు.

విద్యాహక్కు చట్టాన్ని విధిగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

● ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

గద్వాలటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యను వ్యాపారంగా మారుతున్న క్రమంలో దశాబ్దం క్రితం రూపొందించిన విద్యాహక్కు చట్టాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన నర్మద, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమి, ఉపాధ్యాయుల కొరత, ప్రైవేటు విద్యాసంస్థల పాలిటవరంగా మారిందన్నారు. ఇంగ్లిష్ మీడియం పేరుతో, టెక్నికల్ విద్య పేరుతో, ఇతరత్రా కోచింగ్‌ల మాటున పెద్దఎత్తున ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు విద్యాసంస్థల ఆగడాలకు అడ్డుకట్ట వేయడం విద్యాహక్కు చట్టంతోనే సాధ్యమన్నారు. కాగా, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఉపాధ్యాయులన కొరతను తీర్చాలన్నారు. విద్యా సంవత్సరం ఆరంభమైనందున బోధనకు ఆటంకం లేకుండా ఏర్పాటు చేయాలన్నారు.

అదే సమయంలో పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచి ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలన్నారు. సమావేశంలో వినోద, అమ్ములు, శిరీష, ఖైరూన్ ఉన్నారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం ప్రపంచానికి ముప్పు

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

● నిరసన తెలిపిన వామపక్షాలు, ప్రజాసంఘాలు

గద్వాల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద శక్తుల ప్రోద్బలంతో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధోన్మాదం ప్రపంచానికే ముప్పుగా పరిణమించనుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. పాలస్తీనా, గాజా, ఇరాన్ దేశాలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దాడులను నిరసిస్తూ గురువారం పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆంజనేయులు, ఇజ్రాయిల్ దాడులతో గాజా ఇప్పటికే అన్నివిధాలా సర్వనాశనం కాగా, ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధప్రభావం ప్రపంచానికి విస్తరించే ప్రమాదం ఉందన్నారు. ఆయుధాల వ్యాపార విస్తరణ, ఆధిపత్య ధోరణి కోసం అమెరికా ఇజ్రాయిల్‌ను ప్రోత్సహిస్తున్న తీరు ప్రపంచ మానవాళికి ముప్పుగా పరిణమించిందన్నారు. భారతదేశం అనుసరిస్తున్న విదేశీ విధానాన్ని మరింత దృఢంగా కొనసాగించడంతో పాటు అమెరికా వైఖరిపై తీవ్ర నిరసన తెలపాలన్నారు. యుద్ధం మరికొన్నాళ్లు కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పాటు అన్ని ఆహార వస్తువుల ధరలు పెరిగిపోయే ప్రమాదముందన్నారు.

కార్యక్రమంలో ఉప్పేరు నరసింహ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ ప్రభాకర్, సీపీఐ, సీపీఎం, ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు రంగన్న, ఆశన్న, పరశు, కాశీం, నాగన్న, ప్రభుదాస్, ధర్మన్న, తిమ్మప్ప, కృష్ణ నాగరాజు, బుచ్చన్న ఉన్నారు.